ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 3 ఏప్రిల్ 2024





కడప గడ్డపై అన్నకు చెల్లి సవాల్



షర్మిలకు విజయం చేకూరాలని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్ విజయలక్ష్మి

- కాంగ్రెస్ తరపున కడప ఎంపీ బరిలో షర్మిలారెడ్డి
- వివేకా హత్యే ప్రధాన ప్రచార అస్త్రం
- కడప పోరుపై తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి

కడప, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారాలపట్టి.. ఆయన ముద్దుగా పిలుచుకునే షమ్మి (షర్మిలారెడ్డి).. సీఎం జగన్ సోదరి కడప గడ్డ నుంచి అన్నకే సవాల్ విసురుతున్నారు. 2019 ఎన్నికల్లో షర్మిల తన అన్న గెలుపు కోసం ప్రచారం చేశారు. ఇపుడు అదే అన్న పార్టీని ఓడించేందుకు సొంతగడ్డలో వివేకా హత్యకేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్‌రెడ్డిని ఓడించేందుకు ఎన్నికల కదనరంగంలోకి దూకనున్నారు. కడప పార్లమెంట్ అభ్యర్థిగా తాను పోటీచేస్తున్నట్లు పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ సాక్షిగా మంగళవారం వెల్లడించారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి పోటీ చేస్తుండగా కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిలారెడ్డి, టీడీపీ నుంచి భూపేశ్‌రెడ్డి బరిలో దిగనున్నారు. ఈ ఎన్నికలో వివేకా హత్యే ప్రధాన అస్త్రంగా మారింది. కడప గడ్డలో షర్మిల అన్నపైనే జగన్‌ను ఎదిరించి పోటీ చేస్తుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ ఎన్నికపై ఆసక్తి నెలకొంది.

చిన్నాన్నకు న్యాయం చేసేందుకు..

కడప పార్లమెంట్ స్థానానికి తొలిసారిగా ఒకే కుటుంబం నుంచి వేర్వేరు పార్టీల తరపున బరిలో దిగనున్నారు. రాజశేఖర్‌రెడ్డికి షర్మిల అంటే మహా ప్రేమ అని చెబుతారు. ఆస్తిలో కూడా చెరిసగం ఇచ్చారని చెబుతారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం జగన్ సొంత పార్టీని స్థాపించుకోవడం, అక్రమాస్తుల కేసులో 16నెలలు జైలుకు వెళ్లగా.. షర్మిల పాదయాత్ర చేసి పార్టీని నిలబెట్టారు. 2014, 2019 ఎన్నికల్లో జగన్ గెలుపునకు ప్రచారం చేశారు. తాను జగనన్న వదిలిన బాణం అంటూ పాదయాత్రలో చెప్పుకుంటూ వచ్చారు. జగన్ సీఎం అయిన తర్వాత వారి కుటుంబంలో విభేదాలు వచ్చాయంటారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్లను సీబీఐ చేర్చడం, ఈ విషయంలో వారిని కాపాడుతున్నారంటూ వైఎస్ షర్మిల, సునీతలు సీఎం జగన్‌ను డైరెక్ట్ అటాక్ చేస్తూ వచ్చారు. అన్న వదిలిన బాణం వెనుదిరిగి పీసీసీ అధ్యక్షురాలయ్యారు. ఆమె కడప పార్లమెంట్ నుంచే పోటీకి దిగుతుండటంతో చర్చనీయాంశంగా మారింది. "చిన్నాన్నకే న్యాయం చేయకపోతే ఇక ఎవరికి న్యాయం చేస్తాం.. చనిపోక ముందు ఎంపీగా పోటీ చేయాలని నాతో చిన్నాన్న అన్నారు. నన్ను ఎంపీగా చూడాలన్నది ఆయన కోరిక. ఆయనను హత్య చేసిన వారే మళ్లీ పోటీ చేస్తున్నారు. అందుకే అవినాశ్‌రెడ్డిపై నేను పోటీ చేస్తున్నా" అని షర్మిలారెడ్డి చెప్పారు. వైఎస్ కుటుంబీకులు కడప ఎంపీ స్థానానికి చెరో పార్టీ నుంచి పోటీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

వైసీపీ ఓట్లకు గండి

కాంగ్రెస్‌కు సంప్రదాయ మైనార్టీలు, క్రిస్టియన్ ఓట్లు ఉండేవి. అయితే జగన్ పార్టీ పెట్టిన తర్వాత ఆ ఓట్లు అటు వైపు వెళ్లాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత కాంగ్రెస్ ఉనికి కోల్పోయింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల పగ్గాలు చేపట్టడంతో పదేళ్ల తర్వాత కాస్త గాడికి వచ్చింది. ఈసారి మైనార్టీలు, క్రిస్టియన్లలో కూడా మార్పు వచ్చిందంటారు. మంగళవారం కడపలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు పెద్ద సంఖ్యలో మైనార్టీలు వచ్చారు. జిల్లాలో షర్మిల విస్తృతంగా ఇంటింటికి తిరిగితే వైసీపీకి ఉన్న కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లు మళ్లీ ఆ పార్టీకే వస్తాయంటున్నారు. రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా షర్మిలను ఆయన అభిమానులు ఆదరిస్తారని అంటున్నారు. ఆయన అభిమానులు జగన్ సీఎం కాకముందు వైఎస్‌పై ఉన్న అభిమానంతో అహర్నిశలు కష్టపడ్డారు. అయితే ఆయన సీఎం అయిన తర్వాత వైఎస్ అభిమానులను పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. అలాగే జగన్‌పై ఆ పార్టీ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. వీరంతా కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని ప్రచారం సాగుతోంది. ఈ మేరకు ఆమె జిల్లాలో పర్యటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది.

ఆచితూచి అభ్యర్థుల ఎంపిక

కడప పార్లమెంట్ నుంచి షర్మిల బరిలో దిగుతుండడంతో ఇక పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ సాగించినట్లు చెబుతున్నారు. మంగళవారం 114 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. అయితే ఈ జాబితాలో బద్వేలు నుంచి విజయజ్యోతి మాత్రమే ఉన్నారు. కడప, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరులలో బలమైన అభ్యర్థులను నిలబెట్టి ఎంపీగా గెలిచేందుకు అడుగులేస్తున్నట్లు చెబుతున్నారు.

కడపలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్ షర్మిలా రెడ్డి



మీ రాజశేఖర్‌రెడ్డి బిడ్డను ఆశీర్వదించండి

- ముస్లిం మైనార్టీల పక్షపాతి వైఎస్
- కాంగ్రెస్‌తోనే వారికి రక్షణ
- కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి
- ఇఫ్తార్ విందుకు హాజరు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 2: అన్ని వర్గాలకు భద్రత, రక్షణ కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించేలా వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డనైన తనను ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని పీసీసీ అధ్యక్షురాలు, కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి కోరారు. మంగళవారం కడప పర్యటనకు వచ్చిన ఆమె మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, నేతలతో కలసి నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని జమాయితే ఉలిమ హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. వారందరూ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పెద్ద దర్గా సమీపంలో కాంగ్రెస్ నాయకుడు సలావుద్దీన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిలా రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఎనలేని ప్రేమ అన్నారు. ముస్లిం, మైనార్టీల పిల్లలు విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థితికి రాణించాలని రిజర్వేషన్లు కల్పించేందుకు సుప్రీంకోర్టులో పోరాటం చేసి 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్‌దే అన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడేందుకు, పవిత్రమైన మక్కాకు వెళ్లే హజ్ యాత్రికుల కోసం, పేదింటి మహిళల వివాహాల కోసం అనేక సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. ఆయన బాటలోనే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి కడప ఎంపీగా గెలిపించాలన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం పెద్ద దర్గాలో ప్రార్థలు నిర్వహించారు. కాగా మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో కడపకు వచ్చిన వైఎస్ విజయలక్ష్మికి, వైఎస్ షర్మిలా రెడ్డికి కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, పీసీసీ నేత మస్తాన్ వలి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు నజీర్ అహమ్మద్, విష్ణు ప్రీతంరెడ్డి, బద్వేలు కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి, పీసీసీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రావు, కోడూరు అభ్యర్థి గోశాల దేవి, పీసీసీ నేతలు ఎస్‌ఏ సత్తార్, చీకటి చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఘాట్‌లో షర్మిల, విజయలక్ష్మి నివాళులు

వేంపల్లె, ఏప్రిల్2: ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఆయన కుమార్తె షర్మిలారెడ్డి, భార్య విజయలక్ష్మి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం 2:30గంటల ప్రాంతంలో ఇడుపులపాయకు చేరుకున్న వీరు వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు అర్పించారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాను వైఎస్ సమాధి వద్ద ఉంచి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డను ఆశీర్వదించాలని అనుకున్న లక్ష్యం నెరవేరేలా విజయం చేకూరేలా దీవించాలని కోరారు. అక్కడకు సమీపంలోనే వైఎస్సార్ ఘాట్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏపీసీసీ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఏపీ ఐదు ఎంపీ స్థానాలకు, 114 ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కడప నుంచి తాను ఎంపీగా పోటీ చేస్తున్నట్లు షర్మిల ప్రకటించారు. రాష్ట్రంలో జగన్ చేస్తున్న హత్యా రాజకీయాలను రూపుమాపాలంటే వైసీపీని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ఆమె పిలుపునిచ్చారు.



ఇడుపులపాయలో వైఎస్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న షర్మిల, విజయలక్ష్మి

అధికారంలోకి రాగానే రూ.4వేలు పెన్షన్

- టీడీపీపై బురద చల్లేందుకే పింఛన్ల నిలుపుదల
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 2: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు నెలకు రూ.4వేల చొప్పున అందిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. టీడీపీపై బురద చల్లేందుకే వైసీపీ ప్రభుత్వం పింఛన్లు నిలుపుదల చేసిందన్నారు. మంగళవారం కడపలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా పింఛన్లు ప్రారంభించింది టీడీపీ ప్రభుత్వమని గుర్తుచేశారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో పెన్షన్ రూ.వెయ్యి పెంచి.. విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా ఇచ్చింది తిరిగి రాబట్టుకున్నారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల జీతాలకు కొదవ లేదని, పింఛన్లు ఇచ్చేందుకు ఆటంకం ఎందుకని ప్రశ్నించారు. పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్ నెలకు రూ.4వేలు అందిస్తామని హామీ ఇచ్చారు.
కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు ఖజానా దోచిపెట్టి అవ్వతాతలకు అన్యాయం చేస్తారా అని మండిపడ్డారు. పింఛన్ల నిలుపుదలపై వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినా... వైసీపీ ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారన్నారు. పింఛన్ల నిలుపుదలపై డిప్యూటీ సీఎం సోషల్ మీడియాలో టీడీపీపై విషప్రచారం చేస్తున్నారన్నారు. సైన్‌బోర్డులకు ఎన్నికల కమిషన్ నుంచి అనుమతులు తీసుకుని కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించి ఏర్పాటు చేస్తే.. వాటిని చింపే పనిలో డిప్యూటీ సీఎం అనుచరులు ఉన్నారన్నారు. సీసీ ఫుటేజీలో వివరాలు బయటకు తీసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ దివాలా తీసిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకొండారెడ్డి, రాంప్రసాద్, జిలానీబాషా పాల్గొన్నారు.

మండే ఎండలు

- రాష్ట్రంలో అత్యధికం.. జిల్లాలోనే

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారం క్రితం వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 38 వరకు ఉండగా, తరువాత పెరుగుతూ వస్తున్నాయి. 43 డిగ్రీలు దాటడమే కాక రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. మంగళవారం ఉదయం 9గంటల నుంచి ఎండ తీవ్రత కనిపించింది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అత్యధికంగా ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా 9 మండలాల్లో ఉష్ణోగ్రతలు నమోదు కాగా వాటిలో ఐదు మండలాలు మన జిల్లాలో ఉండడం విశేషం. చాపాడు 43.8 డిగ్రీలు, తొండూరు 43.5, వీరపునాయునిపల్లె 43.4, వేముల 43.2, పెండ్లిమర్రి 42.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఐదు మండలాల్లో తీవ్ర వడగాలులు వీచాయి. మరో 19 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. ఈ మండలాల్లో వడగాలులు వీచాయి.
కడప 43.4, సిద్దవటం 43.4, ఒంటిమిట్ట 43.4, పోరుమామిళ్ల 43, ఎర్రగుంట్ల 42.1, చక్రాయపేట 41.6, చెన్నూరు 42.1, ఖాజీపేట 42.9, ప్రొద్దుటూరు 42.7, కలసపాడు 42.5, జమ్మలమడుగు 42.8, కొండాపురం 41.5, వల్లూరు 42.8, మైలవరం 41.7, ముద్దనూరు 42.4, లింగాల 42.1, వేంపల్లె 41.5, సింహాద్రిపురం 42.8, కమలాపురం 42.6, డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ ఆరంభంలోనే ఈ స్థాయి ఎండలు ఉండడంతో రానున్న రోజుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఉత్తుత్తి శంకుస్థాపన

- రూ.23 కోట్లతో బుగ్గవంకపై మూడునెలల క్రితం భూమిపూజ
- పాల్గొన్న డిప్యూటీ సీఎం, మేయర్
- కమిటీ ఆమోదం లేకుండానే శంకుస్థాపన
- ఇంతవరకు టెండర్లకు రాని వైనం



రవీంద్రనగర్‌కు బ్రిడ్జి నిర్మించాల్సింది ఇక్కడే

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ప్రభుత్వంలో పాలనాపరమైన నిర్ణయాలు ఇతరత్రా వాటిపై అంతా రివర్స్ జరుగుతుండడంతో చాలా తొందరలోనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇక జగన్‌తో సహా సొంత ఎలివేషన్లు ఇచ్చుకోవడంలో ఆ పార్టీకి మించింది ఇంకోటి లేదంటారు. ఇప్పుడు సంక్షేమ పథకాల కోసం జగన్ నొక్కే బటన్లు చాలాసార్లు ఉత్తుత్తిగా కానొచ్చాయి. ఎందుకంటే ఖాతాల్లో బటన్ నొక్కుడు నిధులు వెంటనే జమ అయ్యేవి కావు. అసలు కమిటీ ఆమోదం లేకుండానే ఉత్తుత్తి భూమి పూజలు కూడా జగన్ పాలనలోనే సాగడం గమనార్హం.
మిగతా జిల్లాలతో పోలిస్తే జగన్ సొంత జిల్లా కావడంతో ఇక్కడ అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉండదని బయటి జనం భావిస్తుంటారు. కానీ కొన్ని పనులకు సంబంధించి నిధులు కూడా జీవోల్లో ఉంటాయి తప్ప విడుదల కావు. రాని నిధులు వచ్చినట్లుగా కటింగ్ ఇచ్చి శంకుస్థాపనలు, భూమి పూజ చేయడం వైసీపీ వారికే చెల్లింది. నిధులు రాకున్నా వచ్చినట్లు శంకుస్థాపనలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.
కడప నగరం అంటే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది బుగ్గవంక. నాగరాజుపేట, రవీంద్రనగర్, ఎర్రముక్కపల్లె, బాలాజీనగర్.. ఇలా నాలుగు డివిజన్లు బుగ్గవంకకు అటుఇటు ఉన్నాయి. ఇటీవలే బుగ్గవంక సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. ఇరువైపులా రక్షణ గోడ నిర్మించారు. తులశమ్మ హాస్పిటల్ సమీపంలో ఉన్న రవీంద్రనగర్‌కు వెళ్లేచోట గుర్రాలగడ్డ వద్ద రెండులో లెవల్ బ్రిడ్జిలు ఉండేవి. రక్షణగోడలో భాగంగా ఒకటి తొలగించారు. దీంతో కేవలం పాతబస్టాండులోని హైలెవల్ బ్రిడ్జిపైనే రాకపోకలు సాగుతుంటాయి. లోలెవల్ బ్రిడ్జిలు తొలగించడంతో నాలుగు డివిజన్లకు సరైన రోడ్లు లేకుండా పోయాయి. గుర్రాలగడ్డ వద్ద, రవీంద్రనగర్ వద్ద వెళ్లే రెండు బ్రిడ్జిలు నిర్మాణం చేపడతామని పలుమార్లు డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ సురేశ్‌బాబు చెబుతూ వచ్చేవారు. ఈ మేరకు గత ఏడాది డిసెంబరు 19న గుర్రాలగడ్డ వద్ద సుమారు రూ.12 కోట్లు, తులశమ్మ హాస్పిటల్ నుంచి రవీంద్రగర్ వెళ్లే మార్గంలో సుమారు రూ.11 కోట్ల వ్యయంతో రెండు బ్రిడ్జిలకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు భూమిపూజ చేశారు. "ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారి రవీంద్రనగర్, నాగరాజుపేట జనం ఇబ్బందులకు గురయ్యేవారు. రాకపోకలతో ఇబ్బందులు పడేవారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో సమస్య పరిష్కారం అవుతుంది" అని శంకుస్థాపన సమయంలో డిప్యూటీ సీఎం, మేయర్ చెప్పుకొచ్చారు. సీన్ కట్ చేస్తే..



గుర్రాలగడ్డ వద్ద బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

కమిటీ ఆమోదం లేకుండానే భూమిపూజ

సరిగ్గా మూడునెలల క్రితం బ్రిడ్జిల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రవీంద్రనగర్, ఇటు నాగరాజుపేట వాసులు సంబరపడ్డారు. బ్రిడ్జిల సమస్య తీరిందని రాకపోకలకు ఇబ్బంది ఉండదని సంతోషించారు. పాతబస్టాండులోని బ్రిడ్జిమీద ప్రయాణించాలంటే ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. కొత్త బ్రిడ్జి ఏర్పాటుతో సమస్య పరిష్కారం అవుతుందని అనుకున్నారు. అయితే ఇవి ఉత్తుత్తి భూమిపూజలే అని పాపం జనాలకు అప్పుడు తెలియలేదు.
ఇప్పటిదాకా ఏదైనా అభివృద్ధి పని చేపట్టాలంటే దానికి అంచనాలు వేసి దానికి ఆమోదం పొందిన తరువాత నిధుల మంజూరు, టెండరు పూర్తయి వెంటనే భూమి పూజ చేస్తూ వచ్చేవారు. అత్యవసర పరిస్థితుల్లో అయితే యుద్ధప్రాతిపదికన పనులు చేపడతారు. అయితే జగన్ పాలన రివర్స్ కాబట్టి.. అనుమతులు లేకుండానే భూమిపూజ చేయడం వింతల్లో కెల్లా వింత. వీటి నిర్మాణానికి సంబంధించి కమిటీ ఆమోదం తెలపలేదు. దీంతో పైసా నిధులు రాలేదు. పని మొదలు కాలేదు. బ్రిడ్జి లేకపోవడంతో గుర్రాలగడ్డ వద్ద రక్షణ గోడకు ఉన్న రంధ్రంలో నుంచి జనాలు రాకపోకలు సాగిస్తున్నారు. శంకుస్థాపనలు చేసి మూడునెలలు దాటినా ఇంకా పనులు మొదలు కాలేదు. బ్రిడ్జిల నిర్మాణానికి వైసీపీ ప్రజాప్రతినిధులు ఉత్తుత్తి భూమి పూజ, శంకుస్థాపన చేయడం ఎన్నికల స్టంటేనని స్థానికులు విమర్శిస్తున్నారు.





రవీంద్రనగర్‌లోకి వెళ్లాలంటే ఈ కన్నమే గతి

వడదెబ్బ మరణాలను నివారించండి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో కొండయ్య

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2: వాతావరణంలో ఎండ వేడిమి పెరిగినందున ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ మరణాలను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెల మొదటి మంగళవారం జరిగే ఆశాడే సమావేశాల్లో భాగంగా రాయచోటి మండల పరిధి లోని యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న సమావేశాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ, ఎండదెబ్బ గురించి తెలుపుతూ ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైన కారణంగా శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎండకు బయట తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శైలజ, టీబీ, లెప్రసీల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా పారామెడికల్ ఆఫీసర్ రవికుమార్, సబ్‌యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, రమణమ్మ, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, ఏఎన్‌యంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యాన యూనివర్సిటీ వార్షికోత్సవం



పరిశోధన స్టాల్స్‌ను తిలకిస్తున్న డాక్టర్ డి.రవీంద్ర, కళాశాల బృందం

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 2: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ 14వ వార్షికోత్సవం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉద్యాన కళాశాల డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ డి.రవీంద్ర పాల్గొని విద్యార్థుల ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్‌ను ఆసక్తితో వీక్షించారు. విద్యార్థులు పండించిన వివిధ రకాల ఉత్పత్తుల గురించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం పామాయిల్ సాగు, సీడ్ గార్డెన్ ఎగుమతి గురించి వాటి భవిష్యత్ అభివృద్ధి విద్యార్థులకు వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి, విద్యార్థుల పురోగతి పరిశోధనలను వివరించి వారిని అభినందించారు. జోనల్ హెడ్ ఆఫ్ రిసర్చ్ డాక్టర్ కె.టి.వెంకట రమణ యూనివర్సిటీ చరిత్ర, పరిశోధన స్థానాలను వాటి ప్రత్యేకతను, చేసిన అభివృద్ధి గురించి విశ్లేషించారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



వన్యప్రాణుల కోసం కుంటల్లో నీళ్లు నింపుతున్న అటవీ శాఖాధికారులు

సిద్దవటం, ఏప్రిల్ 2: అడవిలోని వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు పేర్కొన్నారు. అడవిలోని వన్యప్రాణులను కాపాడేందుకు, వాటి సంఖ్య పెంచేందుకు జిల్లా ఫారెస్ట్ అధికారి సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందించామన్నారు. సిద్దవటం రేంజ్ పరిధిలోని బేస్ క్యాం పులను ఏర్పాటు చేసి స్మగ్లర్ల ఆటకట్టించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలియజేశారు. ఎండలు విపరీతంగా పెరుగుతుండటంతో వన్యప్రాణులు దాహం తీర్చేందుకు నీటి తొట్టెలను, నీటి కుంటలను ఏర్పాటు చేశామన్నారు. నీటి తొట్ల వద్ద వేటగాళ్లు వన్నె ప్రాణాలను వేటాడుకుండా సీసీ కెమెరాలతో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కొండ ప్రాంతంలో కొంతమంది ఆకతాయిలు నిప్పు పెడుతున్నారని.. వాటిని నివారించేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలి పారు. గ్రామసభలు ఏర్పాటు చేసి అటవీ సంపద గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ స్నాతకోత్సవ దరఖాస్తుల గడువు పొడిగింపు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2: వైవీయూ స్నాతకోత్సవంలో పట్టాలు పొందడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 4 వరకు పొడిగించినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ వెల్లడించారు. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 8 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 11725 మంది దరఖాస్తు చేసుకున్నరన్నారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘనపై ఇద్దరికి నోటీసులు

మైదుకూరు, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అతిక్రమించారనే ఫిర్యాదు మేరకు మైదుకూరు నియోజకవర్గంలో వలంటీరుతో పాటు ఆర్టీసీ కార్మికుడికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. పెన్షన్లు పంపిణీ విషయంపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన స్థానిక 5వ సచివాలయం పరిధిలోని మూలే శ్రీనివాసులరెడ్డిపై సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచు రితమైంది. దీంతో పాటు వైసీపీ అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి వెంట ఖాజీపేట మండలంలో ప్రచారంలో ఆర్టీసీ ఉద్యోగి శ్రీనివాసులరెడ్డి పాల్గొనడంపై టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ ఆర్వోకు ఫిర్యాదు చేశారు. వారికి మంగళవారం సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2: డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి మూడు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ మంగళవారం రాయచోటి అడిషినల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పు చెప్పారు. మద్యం సేవించి రాయచోటి పట్టణంలో వాహనాలు నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు సంబేపల్లె మండలం మద్దెన వడ్డెపల్లెకు చెందిన దేరంగుల చెన్నక్రిష్ణ, ఎస్ఎన్ కాలనీకి చెందిన షేక్.బాబా, రాజులకాలనీకి చెందిన వంగిమళ్ల గణేశ్, కేతంరెడ్డి నాగసుబ్బారెడ్డిలపై డ్రంకెన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచగా.. జడ్జి శారద మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



నాగేశ్వరి మృతదేహం

చాపాడు, ఏప్రిల్ 2: మండలంలోని పల్లవోలు గ్రామ దళితవాడలో మంగళవారం చిరికోళ్ల నాగేశ్వరి (17) అనే విద్యార్థిని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు.. నాగేశ్వరి సీబీఐటీ కాలేజీలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతోంది. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. కడుపు నొప్పి ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం.. భూపేశ్‌రెడ్డి

- *ప్రాణాలు ఎదురొడ్డి పోరాడాలి...బీటెక్ రవి*





వేంపల్లెలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి, పక్కన భూపేశ్‌రెడ్డి, హాజరైన వేముల, వేంపల్లె మండలాల టీడీపీ శ్రేణులు

వేంపల్లె, ఏప్రిల్ 2: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని అంతం చేసి.. సంక్షేమం-అభివృద్ధి చేసే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తెలిపారు. గతంలో మాదిరి పరిస్థితి ఉండదు. ఈసారి అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు వందశాతం అధికారాలిస్తామని చంద్రబాబు చెప్పినట్లు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి తెలియజేశారు. వేంపల్లెలో కల్యాణ మండపంలో మంగళవారం వేంపల్లె, వేముల మండలాల టీడీపీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో వివేకానందరెడ్డి హత్యను రాజకీయంగా వాడుకొని టీడీపీపై బురదజల్లుతూ ఓట్లు దండుకున్నారని, చివరకు హత్య ఎవరు చేశారో అందరికి తెలుసన్నారు. బటన్ నొక్కుతూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పుకుంటున్న జగన్ కరెంటు బిల్లులు, ఆర్టీసీ చార్జీలు, నాశిరకం మందుతో ప్రజలను పీల్చి పిప్పిచేశారన్నారు. రైతుకు సక్రమంగా 7గంటల విద్యుత్ సరఫరా చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు, కడప-బెంగుళూరు రైల్వేలైన్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కష్టపడి పనిచేసే వారికి టీడీపీ గుర్తింపునిస్తుందని చెప్పడానికి ఎంపీ టికెట్ నాకివ్వడమే నిదర్శనమన్నారు.

బీటెక్ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రామస్థాయి నుంచి ఈ 40 రోజులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గతాన్ని మరవండి, నేను చంద్రబాబునాయుడును నమ్మి ప్రాణాలు ఎదురొడ్డి పనిచేస్తున్నా, మీరు నన్ను నమ్మి ప్రాణాలు ఎదురొడ్డి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ అధికారంలో ఉంటే వందశాతం ఆపార్టీ కార్యకర్తలు అధికారం అనుభవిస్తారు, టీడీపీ అధికారంలో ఉన్నా 25శాతం కూడా అనుభవించలేదని, ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళితే ఈసారి పరిస్థితి అలా ఉండదు, అందరు నాయకులు, కార్యకర్తలు గౌరవిస్తారు, వారితో పనిచేయించేలా అవకాశం కల్పించాలని చెప్పారని, అందుకు మీరే సాక్ష్యమని బీటెక్ రవి పునరుద్ఘాటించారు. అనంతరం భూపేశ్‌రెడ్డిని పలువురు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, సీనియర్ నాయకులు ఎస్‌బీ జయరామిరెడ్డి, షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షులు భద్ర, పట్టణ అధ్యక్షులు ఆర్వీ రమేష్, వేముల నాయకులు బ్రహ్మయ్య, అంకిరెడ్డి, ఓబులరెడ్డియాదవ్, చాగలేరు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుగవాసిని కలిసిన టీడీపీ నేతలు





సుగవాసి సుబ్రమణ్యంను కలిసి మద్దతు తెలుపుతున్నపత్తిపాటి కుసుమకుమారి, రాచపల్లె పంచాయతీ టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2: రాజంపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్ర మణ్యంను మంగళవారం రాజంపేట నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు పత్తిపాటి కుసుమకుమారి ఆయనను శాలువాతో సన్మానించారు. ఒంటిమిట్ట మండలం ఉపసర్పంచ్ శంకరయ్య, వీరబల్లి మండలం ఈడిగపల్లికి చెందిన పలువురు, ఒంటిమిట్ట మండలం రాచపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు హరికృష్ణం రాజు, ముప్పాళ్ల విష్ణురాజు, రవిచంద్రరాజు, శేఖర్‌రాజు, నరసింహారాజు, బాలరాజు, సుబహాన్, సుబ్బరాయుడు తదితరులు సుగవాసి సుబ్రమణ్యంను కలిసి శాలువాతో సత్కరించి మద్దతు ప్రకటించారు.

జగన్ వచ్చారు..జనానికి కష్టాలు తెచ్చారు



కాండ్లమడుగు క్రాస్‌లో జాతీయ రహదారిపై వాహనాలను ఆపివేసిన పోలీసులు

బి.కొత్తకోట,ఏప్రిల్ 2: వైసీపీ అధినేత జగన్‌రెడ్డి చేపట్టిన రోడ్‌షో సామాన్య జనానికి, దూర ప్రాంత ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. సోమవారం రాత్రికి జిల్లా సరిహద్దు చీకటిమానిపల్లె శివారులో విడిది చేసిన సీఎం జగన్ మంగళవారం ఉదయం 10.40 కి బస్సుయాత్ర ప్రారంభించారు. ఇందులో భాగంగా చెన్నై జాతీయ రహదారిపై బి. కొత్తకోట మండల పరిధిలోకి వచ్చే తుమ్మనంగుట్ట, గోళ్లపల్లి, అమరనారాయణపురం(కాండ్లమడుగుక్రాస్)ల మీదుగా మదనపల్లె వైపునకు బస్సుయాత్ర సాగింది. కాగా ఈ బస్సుయాత్ర సామాన్య జనానికి శాపంగా మారింది. దారి పొడవునా పోలీసులు మదనపల్లె వైపు వచ్చే వాహనాలను ఆపేశారు. దీంతో గంటల తర బడి ట్రాఫిక్ నిలిచిపోయింది. సీఎం కాన్వాయ్‌కు ఎదురు వెళ్లే వాహ నాలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం కనిపిం చింది. కాండ్లమడుగు క్రాస్‌లో సీఎం వచ్చిన సయయంలో కరెంటుకో త విధించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 2: మదనపల్లె, కురబలకోట మండలా ల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. మదనపల్లె మండలం కురవంకకు చెందిన లక్ష్మీనారా యణ(58) బి.కొత్తకోట మండలంలోని సిరికల్చర్ కేంద్రంలో ఎస్‌టీఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవా రం ఉదయం ద్విచక్రవాహనంలో విధులకు వెళుతుండగా మార్గమధ్యంలో కంటేవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం లక్ష్మీనారాయణను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రం గా గాయపడిన అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలిం చగా, పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశా రు. ఆ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు ముదివేడు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగుకు చెందిన వెంకటరమణారెడ్డి(82) మదనపల్లె పట్టణంలో రోడ్డు దాటుతుండగా వాటర్ క్యాన్‌లు వేసుకుని వెళుతున్న ఆటో ఢీ కొంది. దీంతో ఈ ప్రమాదంలో గాయప డిన అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.


అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు మృతదేహం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 2: మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు అనే వ్యక్తి మంగళవారం కొత్తపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... శ్రీనివాసులు రోజూ మాదిరిగానే పొలం వద్దకు వెళ్లాడు. చీకటి పడ్డప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి గాయాలు ఉండటంతో శ్రీనివాసులును హత్య చేసి ఉంటారని, ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



మండెం సిద్దయ్య

చిన్నమండెం, ఏప్రిల్ 2: రామాపురం మండలం కల్పా నాయుని చెరువుకు చెందిన మండెం సిద్దయ్య (62) అనే వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తన కుమా రుడు ఇచ్చిన ఫిర్యాదు మేర కు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం... సిద్దయ్య గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక బాధపడు తుండేవాడు. అతను తన భార్యతో కలిసి మార్చి 22వ తేదీ చిన్న మండెం మండలం చిన్నర్సు పల్లిలోని తన కుమార్తెను చూడడానికి వచ్చారు. అదే రోజు తన కూతురు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోయేసరికి చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. అతని కుమారుడు గత నెల 27వ తేదీ చిన్నమండెం పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో ముగ్గురిపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 2: పాత కక్షల కారణంగా ముగ్గురి పై దాడి చేసి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం తాలుకా పోలీసుల కథనం మేరకు మండలంలోని నారమాకుల తాండకు చెందిన మంగే నాయక్, దొరస్వామినాయక్, సంతోష్ నాయక్‌లపై వలసపల్లె పంచాయతీకి చెందిన శివనాయక్ తన అనుచరులతో కలిసి వచ్చి కర్రలతో దాడి చేసి గాయపర్చారు. గాయపడినవారిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారం చేసిన ముగ్గురు ఉద్యోగులపై కేసు నమోదు

కడప (క్రైం) ఏప్రిల్ 2: కడప నగరం ఆర్టీసీ డిపో గ్యారేజీలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జగన్‌కు ఓటేయాలంటూ ఆ సంఘం నేతలు ప్రచారం చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... ఏపీ సచివాలయ ఉ ద్యోగుల సంఘం రాష్ట్ర నేత వెంకటరామిరెడ్డి, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు చల్లా చంద్రయ్య, పకృద్దీన్ మరికొందరు ఆర్టీసీ గ్యారేజీలో జగన్ సంక్షేమ పథకాలను వివరిస్తూ వైసీపీకి ఓటేయాలని ప్రచారం చేయడంతో వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

టీడీపీ కార్యకర్త కారు ధ్వంసం



కార్యకర్తలతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప (క్రైం) ఏప్రిల్ 2: కడప నగరం చలమారెడ్డిపల్లె వద్ద మంగళవారం పార్కింగ్ చేసి ఉంచిన టీడీపీ కార్యకర్త హనుమంతు కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని కారును పరిశీలించారు. పార్కింగ్ చేసిన తమ కార్యకర్త కారును అధికార పార్టీకి చెందిన వారు ధ్వంసం చేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి రిమ్స్ సీఐకి ఫిర్యాదు చేశారు.

విలువైన ఆస్తి కాజేయాలని దంపతులపై దాడి, హత్యాయత్నం

కురబలకోట, ఏప్రిల్ 2: విలువైన ఆస్తి కాజేయాలని దంప తులపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండ లంలో జరిగింది. దీనికి సంబంధించి బాధితుల కథ నం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డి గారిపల్లె ఎర్రజేనువారిపల్లెకు చెందిన అమరనాథరెడ్డి అతని భార్య రెడ్డెమ్మలకు జాతీయ రహదారికి కూత వేటు దూరంలో విలువైన భూమి ఉంది. ఈ భూమిపై కన్నేసిన స్థానికంగా ఉండే ఓ రౌడీ గ్యాంగ్ స్థానికంగా వారి ప్రత్య ర్థులను లొంగదీసుకుని కొంత నగదును ముట్టజెప్పి వారి వద్ద నుంచి అగ్రిమెంట్ రాసుకున్నారు. దీంతో పాటుగా దంపతుల భూమిని కాజేయడానికి పథకం పన్ని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారు. దీనికి ససేమిరా దంపతులు అంగీకరించకపోవడంతో అర్ధరాత్రి వేళలో ఆ గ్యాంగ్ మరియు అనుచరులు, వారికి అనుకూలంగా ఉన్న ప్రత్యర్థులు ఇంట్లోకి చొరబడి దాడి చేసి తీవ్రంగా గాయరిచారు వారి పిల్ల లు 100కు కాల్ చేసినా స్పందించ లేదు. దాడిలో గాయపడ్డ దంపతులను 108 వాహనం సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రంగనాయక ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, తిలకిస్తున్న భక్తులు, అన్నదాన కార్యక్రమం

చిట్వేలి, ఏప్రిల్ 2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగిరిపాడు రంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం కాకర్లవారిపల్లె గ్రామస్తులతో కోలాటం, చెక్కభజన కార్యక్రమాలు, పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం కాకర్లవారిపల్లె గ్రామస్తులు దుగ్గిన రాజయ్య, నారాయణమ్మ కుమారులు కార్తీక్, పోలిన సుదర్శన్ కుటుంబ సభ్యులచే అన్నదానం నిర్వహించారు. అదే విధంగా అదే గ్రామస్తులైన కట్టా నారాయణ, ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బరా యుడు, చిన్నమ్మ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామస్తులు ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు.

టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

● పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల దిశానిర్దేశం


టీడీపీ తీర్థం పుచ్చుకున్న సుంకేసుల గ్రామస్థులతో భూపేష్‌రెడ్డి, బీటెక్ రవి

సింహాద్రిపురం, ఏప్రిల్ 2: టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలానికి సంబంధించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లకు సింహాద్రిపురం బీటెక్ రవి స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేసి టీడీపీ విజయ ఢంకా మోగించేలా కృషి చేయాలని కోరారు. పలు గ్రామాలకు చెందిన వైసీపీ వర్గీయులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీటెక్ రవి వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సింహాద్రిపురం ఎస్సీకాలనీ వాసులు కొమెర్ల కాలువ పవన్‌కుమార్, మంగపట్నం కిరణ్‌కుమార్, పెద్దోళ్ల రమణ వారి కుటుంబాలు, అహోబిళం, సుంకేసుల, వీరాపురం, ఓబుళాపురం, తదితర గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు బీటెక్ రవి చేతుల మీదుగా కండువా వేయించుకుని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ జయభరత్‌రెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జ్ జోగిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత రఘునాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కడపలో టీడీపీ జెండా ఎగురవేద్దాం

● కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి


ముస్లిం మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2 : కడపలో టీడీపీ జెండా ఎగరవేద్దామని ఆ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం ద్వారకానగర్‌లోని ఆమె నివాసంలో ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో టీడీపీలో చేరగా వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనతో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పి మరో పక్క సామాన్య మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపి ఈ ప్రభుత్వం నడ్డి విరిచిందని మండిపడ్డారు. కేవలం అభివృద్ధి సంక్షేమంతోనే సాధ్యమని చెప్పుకుంటూ రాష్ట్ర అభివృద్ధి విస్మరించారన్నారు. జరగబోవు ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

46వ డివిజన్‌లో...

కడప నగరం 46వ డివిజను అక్కాయపల్లెలో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమంఅభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుతం ఉన్న వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాకీర్, శివ, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలి


పింఛన్ల పంపిణీపై ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

చెన్నూరు, ఏప్రిల్ 2 : మండలంలో ప్రతి నెలా అందించే సామాజిక పింఛన్లను ఆలస్యం కాకుండా బుధవారం నుంచే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయించాలని ఎంపీడీఓ సుబ్రమణ్యంశర్మను చెన్నూరు మండల టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను సకాలంలో ప్రతి నెలా ఇవ్వాలని నిబంధనల ఉన్నా పలు రకాల కారణాలు, సాకులతో ప్రతిపక్షపార్టీలపై నెపం పెడుతూ వాయిదా వేయడం తగదన్నారు. పింఛన్లకు అవసరమైన నిధులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మా దగ్గర ఉందని చెప్పినప్పటికీ ఆలస్యం చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థంతోనే ఈ పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేయాలనుకోవడం దారుణమన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, జిల్లా మైనార్టీ నేతలు షబ్బీర్‌హుసేన్ పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ అందించండి


వల్లూరులో ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

వల్లూరు, ఏప్రిల్ 2 : సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందించాలని వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి, ఎర్రమాచు రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకరరెడ్డి ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్లప్పగారి రామచంద్రారెడ్డి, దిగువపల్లె టీడీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు తెలుగు యువత సెక్రటరీ కొప్పల చిట్టిబాబు, పుల్లారెడ్డిపేట టీడీపీ నాయకులు బూచేపల్లి రామమోహన్‌రెడ్డి, మండల టీడీపీ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పుష్పరాజు



కమలాపురం రూరల్, ఏప్రిల్ 2 : కమలాపురం బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పుష్పరాజు ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కమలాపురం బార్ కౌన్సిల్ ఎన్నిక నిర్వహించగాఅందులో పుష్పరాజ్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారని తెలిపారు. ఈయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా బూచుపాటి ఉదయకిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్‌కౌన్సిల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మజ్జిగ అందించడం అభినందనీయం

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 2 : ప్రజల దాహార్తి తీర్చడంలో మంచి నీటితో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేయడం అభినందనీయమని విద్యుత్ శాఖ జిల్లా అధికారి రమణ అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో కడప విద్యుత్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన సందర్శించి ప్రజలకు మజ్జిగను అందించారు. నోరులేని జంతువులు, పక్షుల కోసం మన గృహాల్లో, పరిసరాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి నీటిని నింపి ఉంచాలన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

వేంపల్లె, ఏప్రిల్ 2: వేంపల్లెలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడి నివాళులర్పించారు. వేంపల్లెలో టీడీపీ సమావేశానికి హాజరైన ఆయన మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ దర్బార్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. నాలుగురోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి భూపేష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.

సీపీఐ నుంచి టీడీపీలో చేరిక

ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిల సమక్షంలో వేంపల్లెకు చెందిన సీపీఐ మండల కార్యదర్శి షేక్ బాషా, షేక్ మస్తాన్, సుబ్బారెడ్డి, గంగయ్య, సాంబ, రవి, బాబా ఫక్రుద్దీన్, కిషోర్, దర్బార్, సుదర్శన్, సబుద్దీన్, సలీం, కుమార్, ఆసిఫ్, మధుకుమార్, శివయ్యతో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ట్రిపుల్‌ఐటీకి పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త తదితరులు

వేంపల్లె, ఏప్రిల్ 2: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అండర్-17, అండర్-19 బాలబాలికల పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఎనిమిది పతకాలు సాధించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త తెలిపారు. గత నెల 30 మరియు 31వ తేదీలలో ఎన్టీఆర్ జిల్లా చిల్కూలులో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలలు జరిగాయన్నారు. ఆయా విభాగాలలో మూడు స్వర్ణం, నాలుగు రజతాలు, ఒక కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు.

టీడీపీకి ఓటు వేసి గెలిపించండి

● ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తల్లి, సతీమణి


సంబటూరులో ప్రచారం నిర్వహిస్తున్న పుత్తా సరళమ్మ, శ్రీచైతన్య

కమలాపురం రూరల్, ఏప్రిల్ 2: చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచి రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య, తల్లి పుత్తా సరళమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని సంబటూరు గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. అధికారంలో ఉన్న వైసీపీ ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. అధికార దాహంతో సాధ్యం కాని పథకాలన్నీ ఇచ్చి ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. పేదవాడి సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పి ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేదన్నారు. 30 లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పి 32 ఇళ్లు కూడా కట్టించలేని దౌర్భాగ్య ప్రభుత్వం వైసీపీ అన్నారు. ఒక్క చాన్స్ అన్న పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగించారన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

వలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి




అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న గోవర్ధనరెడ్డి, శివకొండారెడ్డి.. సీకేదిన్నెలో వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు.. వీఎన్‌పల్లెలో...

● కార్పొరేషన్ అదనపు కమిషనరుకు టీడీపీ నేతల వినతి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2 :వలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛనుల లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ కార్పోరేషన్ అదనపు కమిషనర్ రాకేశ్ చంద్రకు వారు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుండి వలంటీరు వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేశారని వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులు ఇతర పెన్షనకుల సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే త్వరితగతిన అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయకుమార్, రవిశంకర్‌రెడ్డి, జయరాం, గురప్ప, శివ, తిరుమలేశ్, రాఘవ, సునీత, మన్నూరు సురేష్, రామాంజనేయులు, విశ్వనాథ్, బాలక్రిష్ణ, నారాయణ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేయాలి

సీకేదిన్నె, ఏప్రిల్ 2: లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ చింతకొమ్మదిన్నె నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్ బాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు 1వ తేదీనే అందించాల్సిన పింఛన్లను ప్రభుత్వం కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యం చేస్తోందన్నారు. పింఛన్లు అందవని ప్రజలకు దుష్ప్రచారం చేస్తూ వారిని తప్పుదోవ పట్టిస్తోందన్నారు. అలాకాక సచివాలయ సిబ్బందితోనే పింఛన్లు పంపిణీ చేస్తే కేవలం రెండు రోజుల్లో ఇంటింటికి తిరిగి అందించగలరని ఆ దిశగా ఏర్పాటు చేసి వృద్ధులను, వికలాంగులకు, వితంతువులను ఇబ్బందులకు గురిచేయకుండా వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దనే వారికి పింఛన్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలి

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 2: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా నేరుగా పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమం నుంచి వలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ పులిరామ్‌సింగ్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీడీపీ సూర్యనారాయణరెడ్డి, గంగిరెడ్డిలు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే నగదు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యం పదిలం

చెన్నూరు, ఏప్రిల్ 2 : ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యం పదిలమని డాక్టర్ శేఖర్‌రాజు అన్నారు. చెన్నూరులోని ఆయుర్వేద వైద్య కేంద్రాన్ని మంగళవారం ఆర్‌డీడీ తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను, ఓపీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నిరకాల వ్యాధులకు స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో మందులున్నాయన్నారు. వైద్యులు కూడా ఆయుర్వేద మందులపై ప్రజలకు అవగాహన కల్పించ ఆ మందులు వాడడం అలవాటు చేయాలన్నారు. ఇంగ్లీషు మందుల కన్నా ఆయుర్వేద మందులు ఎంతో మేలన్నారు. వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, ఫార్మసిస్ట్ రాజశేఖర్, ఎఫ్ఎన్ఓ విజయ, పీటీఎస్ పాల్గొన్నారు

టీడీపీ మేనిఫెస్టోలో ప్రతి కుటుంబానికీ లబ్ధి


ఓటర్లతో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

చెన్నూరు, ఏప్రిల్ 2 :టీడీపీని ఆదరించి గెలిపిస్తే ఆ పార్టీ చెప్పిన మేనిఫెస్టో ప్రకారం ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందని టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటింటికీ ఐదు నిమిషాల కేటాయింపు అన్న నినాదంతో ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు వేసి చంద్రబాబును గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ అంటేనే నీతి నిజాయితీని నిలువుటద్దమని, ఎలాంటి కబ్జాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, రౌడీయిజం ఉండదన్నారు. రాష్ట్రంలో ప్రజలు శాంతియుతంగా నడవాలన్నా, అభివృద్ధిలో నడవాలన్నా, వారి కుటుంబాలు బాగుపడాలన్నా, సంక్షేమ పథకాలు అందుకోవాలన్నా ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకే యువత మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ యువజన అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గోదిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు తెచ్చుకోవద్దు.. ఇబ్బందులపాలు కావద్దు: సీఐ


చెన్నూరు పల్లెనిద్రలో మాట్లాడుతున్న సీఐ

చెన్నూరు, ఏప్రిల్ 2 : ఎన్నికల సమయంలోనూ, ఎన్నికల ముందు ప్రచారంలోనూ, ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ప్రజలు సమస్యలు కొని తెచ్చుకోవద్దని, ఎవరి పనులు వారు సక్రమంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేట్లు చూసుకోవాలని చెన్నూరు సీఐ పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయితీ పార్కు ఆవరణంలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఎన్నికల వేళ గొడవలు, ఘర్షణలకు దిగి ఇతరులకు ఇబ్బందులు కలుగజేస్తుంటారన్నారు మరికొందరు ఓటర్లకు బహుమానాలు, తాయిలాలు ఇస్తుంటారని, కావున వాటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును అమ్ముకోకుండా నిజాయితీ అధికారి కావాలన్నారు. మంచి పరిపాలన దక్షుడుకావాలని, ఆ నమ్మకంతో ఓటు వేసుకుని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి తప్ప ఎలాంటి తప్పుడు దారులకు వెళ్లవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి

● కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు


వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో కవాతు నిర్వహిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

కడప (క్రైం), ఏప్రిల్ 2:రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవా రం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కడప నగరంలోని వన్‌టౌన్ పరిధిలో పలు ప్రాం తాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పూసల వీధి తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు ప్రజలకు భరోసా కల్పించేందుకు గాను ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా శాంతిభద్రతలను కాపాడుకోవడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్ ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు రికార్డులను అందజేయాలి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 2: ఆశా కార్యకర్తలకు వెంటనే రికార్డులను అందజేయాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కారించాలని గత ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వంతో తమ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకత్వం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే అన్నారు. ఆ మేరకు ఆశాల రికార్డులను ఏప్రిల్ మాసం నుంచి ప్రభుత్వమే సరఫరా చేయాల న్నారు. అలాగే ఆశాల రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతున్నట్లుగా హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అమలుచేయకపోవడం సరికాదన్నారు. కావున ప్రభుత్వం స్పందించి రికార్డులను వెంటనే అందించాలని కోరారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి


కప్ సాధించిన క్రీడాకారులతో గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్

కడప (స్పోర్ట్స్), ఏప్రిల్ 2: కబడ్డీ సీనియర్స్ విభాగం రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు కప్ సాధించడం హర్షణీయమని, మరిన్ని విజయాలు సాధించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పుంగనూరులో గత మార్చి 29 నుంచి 31 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో జిల్లా కబడ్డీ జట్టు లీగ్ దశలో ఉత్తమ ప్రతిభ కనబరచి చిత్తూరు జట్టుతో జరిగిన ఫైనల్ పోటీలో విజేతగా నిలిచి కప్‌ను కైవసం చేసుకోవడం అభినంద నీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తద్వారా రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరు నిలబెట్టేలా క్రీడాకారులు రాటుదేలాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు శివగణేష్‌రెడ్డి చెన్నక్రిష్ణారెడ్డి, వేణు, చెన్నకృష్ణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి టి.జనార్దన్ పాల్గొన్నారు.

టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధికార ప్రతినిధిగా దాది


దాది శ్రీనివాసులు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 2: తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధికార ప్రతినిధిగా కడప నగరానికి చెందిన దాది శ్రీనివాసులు నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు తన నియామకం జరిగిందని శ్రీనివాసులు తెలిపారు. కాగా గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తాను చేసిన కృషిని గుర్తించి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి అవిశ్రాంతంగా శ్రమిస్తానన్నారు. ముఖ్యంగా జిల్లాలోని దివ్యాంగులందరినీ ఏకంచేసి టీడీపీ అభ్యర్థుల గెలుపునకు శ్రమిస్తానన్నారు. ఇందులో ప్రధానంగా కడప అసెంబ్లీ నుంచి బరిలో ఉన్న మాధవీరెడ్డి విజయమే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు.

అమరవీరులు నిత్య స్మరణీయులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2 : అమరవీరుల త్యాగాలు నిత్య స్మరణీయమని వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తెలిపారు. వైవీ యూలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎంసీఏ విభాగం షాది దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. వారి దీక్ష, దక్షత వల్లనే మనమంతా స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. అనంతరం ఓటు హక్కుపై ఓటర్ల అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటమణ, ప్రొఫెసరు అనిత, డాక్టర్ కె.లలిత, డాక్టర్ సునీత, డాక్టర్ రెడ్డయ్య, గంగయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ముద్దనూరు ఏప్రిల్2: మండలంలో బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.పింఛన్ దారులకు ఆయా గ్రామ సచివాలయాల వద్ద పంచాయతీ సెక్రటరీ,అసిస్టెంట్ వెల్ఫేర్‌ల ద్వారా పంపిణీ నిర్వహిస్తున్నట్లు, బ్యాంకు నుంచి డబ్బులు తెచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు పంపిణీ చేస్తామన్నారు. అనారోగ్యం, నడవలేక ఇంటికే పరిమితమైన పింఛన్ దారులకు ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి పంపిణీ చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం స్థానిక నెల్లూరు రోడ్డులో ఉన్న ఎస్‌వీసీయం పాలిటెక్నిక్‌కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 25వతేదీ వరకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని బద్వేలు ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు 9912342037, 9848866247ను సంప్రదించాలని కోరారు.

బద్వేలులో వీధికుక్కల స్వైర విహారం



వీధి కుక్కల బారిన పడిన చిన్నారులు

బద్వేలు టౌన్, ఏప్రిల్ 2 :మున్సిపాలిటీ పరిధిలోని పోరుమామిళ్ల రోడ్డు, మెయిన్‌బజారు,అబ్బరాతివీధిలో మంగళవారం ఇంటి వద్ద ఆడుకుంటున్న పిల్లలపై వీధికుక్కలు స్వైర విహారం చేసి గాయపరి చాయి. దీంతో రిత్విక్, సాత్విక్ ఇద్దరు పిల్లలు వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పిల్లలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో రోజుకు ఏదోక చోట వీధి కుక్కలు స్వైరవిహారం చేసి గాయపరుస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కుక్కలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్‌అంతరాయానికి సహకరించండి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 2 : బద్వేలు మున్సిపాలిటీ బ్రహ్మంగారిమఠం, అట్లూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండల విద్యుత్ వినియోగదారులు ఈ నెల 6 వరకు జరిగే విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ వెంకట మహేశ్ తెలిపారు. తలమంచిపట్నం 400 కేవీ సబ్ స్టేషన్ నందు ఎక్స్‌టెన్షన్ పనులు జరుగుతున్నందున మైదుకూరు డివిజను పరిధిలోని 132/33 కేవీ బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, బ్రహ్మంగారిమఠం 220కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

బీరుసీసాలు స్వాధీనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 2 : మల్లకతవ చెక్‌పోస్టు వద్ద 15 బీరుసీసాలను స్వాధీనం చేసుకుని సుబ్బరాయుడు అనేవ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఏఎస్ఐ రాజశేఖర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దమ్మనపల్లెకు చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి 15 బీరుబాటళ్ల తీసుకెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లుతెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేరా..?

జమ్మలమడుగు, ఏప్రిల్ 2: జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాల్లోని పెన్నానది పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా జరుగుతోంది. జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు, ధర్మాపురం, దేవగుడి, పి.సుగుమంచిపల్లె, పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామాల్లో అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిపోతోంది. ప్రతిరోజు జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో, తాడిపత్రి రోడ్డు జమ్మలమడుగు పట్టణంలోని ప్రధాన రోడ్లలో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు జోరుగా తరలిపోతున్నాయి. ప్రస్తుతం జమ్మలమడుగు నియోజకవర్గంలో అధికారులు ప్రకటించినట్లుగా 30 యాక్టు అమలు, ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున తనిఖీలు జరుగుతున్నా ఇసుక ట్రాక్టర్లపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా దారులకు కొందరు అధికారులు, సిబ్బందితో లింకు ఉన్నట్లు సమాచారం. వందల కొలది ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు తరలిపోతున్నా రెవెన్యూ, ఎస్ఈబీ,



తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్

పోలీసులు తదితర అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పెన్నానది వంతెనవైపు నుంచి కన్నెలూరులోని గ్రావెల్ రోడ్డులో, అలాగే గొరిగెనూరు, దేవగుడి గ్రామం హైస్కూలు వద్ద నుంచి పి.సుగుమంచిపల్లెలోని పెన్నానది వైపు నుంచి ట్రాక్టర్లు తరలిపోతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లను అరికట్టే నాథుడే లేరని కొందరు ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అక్రమ ఇసుక ట్రాక్టర్ల యజమానులకు అధికార పార్టీ నేతల అండదండలు బాగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కడైనా ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే అధికార పార్టీకి చెందిన నేతలు కొందరు ఆయా అధికారుల వద్దకు వెళ్లి మాట్లాడుకుంటున్నట్లు సమాచారం. జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో అధికారులు ఉన్నా లేనట్లుగా ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వలన పెన్నానదిలో ఇసుక గుంతలు ఏర్పడి బోర్లకు నీరు అందక ఇబ్బంది పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. జమ్మలమడుగు ఎస్ఈబీ స్టేషన్ సీఐ లతను 'ఆంధ్రజ్యోతి' అక్రమ ఇసుక దందా రవాణాపై వివరణ కోరగా ఇసుక ట్రాక్టర్లు ఎక్కడైనా కనపడితే సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామని, ప్రొద్దుటూరు రోడ్డులోని దేవగుడి, గొరిగెనూరు, పి.సుగుమంచిపల్లె ప్రాంతాల్లో దాడులు చేస్తామని ఆమె తెలిపారు.

ఖజానా ఖాళీతోనే పెన్షన్ ఆలస్యం



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

రాజుపాలెం, ఏప్రిల్ 2 : ఖజానా ఖాళీ కావడంతో 1వతేదీ పంపిణీ చేయాల్సిన పెన్షన్‌ను 3వతేదీకి మార్చారని టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సభాభవన్‌లో ఎంపీడీవో రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ తేదీ పెన్షన్‌ను ఏప్రిల్ 3వ తేదీన పంపిణీ చేస్తామని ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. పెన్షన్‌కు తగిన డబ్బులు లేపోవడంతో పాటు ఉన్న డబ్బులంతా కాంట్రాక్టర్లకు పంచిపెట్టడంతో ఈ ఇబ్బంది ఏర్పడిందని ఆయన తెలిపారు. గ్రామ సచివాలయాల దగ్గర పంపిణీ చేయాలని టీడీపీ కోరిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, నరసింహారెడ్డి, , శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగునీరు



ఆర్టీసీ గ్యారేజీ ఎదురుగా నిండిన డ్రైనేజీ కాలువ

జమ్మలమడుగు, ఏప్రిల్ 2: జమ్మలమడుగులో డ్రైనేజీ కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదురుగా డ్రైనేజీ కాలువల్లో వ్యర్థపదార్థాలు నిండి కొన్ని చోట్ల డ్రైనేజీ నీరు కదల్లేని పరిస్థితిలో ఉంది. మరికొన్ని చోట్ల మురుగు కంపు రోడ్డెక్కింది. ఆర్టీసీ గ్యారేజీ ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన, డీఎస్పీ కార్యాలయం ఎదురుగా, కన్నెలూరు మోటు వరకు రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ కాలువలు దారుణంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని డ్రైనేజీ నీరు రోడ్డుపై రాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒరిగిన విద్యుత్తు స్తంభాలకు మరమ్మతులెన్నడో..?



జమ్మలమడుగు, ఏప్రిల్ 2: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పొలాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగాయి. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామ పొలంలో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఇలాంటి సమస్యలు పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట, బోడితిప్పనపాడు గ్రామ పొలాల్లో ఉన్నాయి. అలాగే జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారి వద్ద మైలవరం మండలంలోని బైపాస్‌రోడ్డు పక్కన ఎస్.ఉప్పలపాడు దారిలో పలుచోట్ల ఒరిగిన విద్యుత్తు స్తంభాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలి :సీఐ



నర్సాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ చిరంజీవి

కాశినాయన, ఏప్రిల్ 2: రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం మిద్దెల ఎస్సీకాలనీలో గ్రామదర్శిని,నర్సాపురంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు కాలనీల్లో పర్యటించి స్థానిక పరిస్థితు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరైనా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠినచర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలకులోబడి నడుచుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: వన్‌టౌన్ సీఐ ఎం.శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రామేశ్వరం, మిట్టమడి వీధి, గురువయ్యతోట, ఆర్ట్స్‌కాలేజీ జంక్షన్, దొరసానిపల్లె వీధి, నాగేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులతో నిర్వహించారు. అంతకు ముందు అక్కడ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కూతురంటే భారం కాదు

ప్రొద్దుటూరు క్రైం, ఏక్రిల్ 2 : కూతురంటే భారం కాదని డాక్టర్ హిమబిందు అన్నారు. మంగళవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎంఆర్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఆడ అయినా మగ అయినా ఇద్దరూ ఒక్కటే అన్నారు. ఈ సందర్భంగా శిశుసంరక్షణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవీ సుబ్బారెడ్డి, ఆరగ్యకార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

విజయమ్మ కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 : మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ విజయమ్మను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే జయరాములుకు లేదని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో గెలిచి టీడీపీలో చేరి ఆపై బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జయ రాములు విజయమ్మ కుటుంబాన్ని ఎలా విమర్శిస్తా రన్నారు. దళితులపై వివక్ష చూపుతున్నారన్న మాటలో ఎంత వరకు సత్యం ఉందని విమర్శించారు. విజయమ్మ నుకానీ ఆమె కుమారుడు రితీష్‌రెడ్డిని కానీ విమర్శించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొండాపురం, ఏప్రిల్ 2: మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామం సమీపంలో పోలీసులు మంగళవారం 600 లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేశారు. నాటుసారా కాచడానికి ఉపయోగించే బెల్లం ఊటను తమ సిబ్బంది సహాయంతో ధ్వంసం చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.తయారీదారుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పి.అనంతపురం సమీపంలో చెలరేగిన మంటలు



చెలరేగిన మంట

కొండాపురం, ఏప్రిల్ 2: మండలంలోని పి.అనంతపురం గ్రామం సమీ పంలో మంగళవారం సాయింత్రం మంటలు చెలరేగాయి.గ్రామ సమీపంలో ఉన్న ఎండుగడ్డి అంటుకొని మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి.మంటలు గ్రామం వైపునకు వస్తుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందారు.గ్రామంలోకి మంటలు వ్యాపించకుండా కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తాడిపత్రి నుంచి ఫైరింజన్ ను తెప్పించి మంటలను ఆర్పించారు. ఆకతాయిలు నిప్పుపెట్టారా లేదా యాదృచ్ఛికంగా మంటలు అంటుకున్నాయా తెలియాల్సి ఉంది.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



ప్రచారం చేస్తున్న భూపేశ్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్

చాపాడు, ఏప్రిల్ 2: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని కడప పార్లమెంటు టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, మైదుకూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఉదయం నాగులపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్నికల్లో తమకు ఓటు వేసి గెలిపించాలని వారు గ్రామస్థులను కోరారు. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయానని, ఇప్పుడు తనకు తప్పకుండా ఓట్లు వేసి గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటానని సుధాకర్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయబ్‌రసూల్, రామమోహన్, ప్రభాకర్‌యాదవ్, అక్బర్ సలీం, మేకల బాబు, వెంకటసుబ్బారెడ్డి, నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న ఎన్నికల ప్రచారం



పోరుమామిళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 2 : మిత్రపక్షం అయిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం పోరుమామిళ్లలోని అమ్మవారిశాలవీధి, ఉద్దికట్ట, పూలబావి, శివాలయం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బద్వేలు నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న తమను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్ర మంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, కల్వకూరి వెంకటసుబ్బయ్య, కనుమర్లపూటి రామసుబ్బారావు, సెట్టెం ప్రతాప్, ఎంపీటీసీ కల్వకూరి రమణ, నెంబరువలి కుమారుడు మస్తాన్‌వలి, శివశంకర్‌రెడ్డి, సుబ్బారావు, గాజులపల్లె రవికుమార్, మౌలాలి, వెంకటేశ్వర్లు, ధర్వేష్, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీజేపీ నాయకులు పండరి, రమణాచారి, జనసేన నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాశినాయన..: ఎన్నికల్లో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి తరుపున ఎన్నికల బరిలో నిలిచిన కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని బీజేపీ అభ్యర్థి బొజ్జారోశన్న కోరారు.మంగళవారం బద్వేల్ తాలూకా బీజేపీ అధ్యక్షుడు ఉట్టిశ్రీనివాసులు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు మురుకూటి రాజారెడ్డితో కలిసి వరికుంట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, హోండా రవీంద్రారెడ్డి, కొండా నరసింహారెడ్డి,సీతా వెంకటసుబ్బయ్య,డి.క్రిష్టారెడ్డి,క్రిష్ణయ్య, బీజేపీ నాయకులు నారాయణరెడ్డి,రామసుబ్బారెడ్డి,బసిరెడ్డి మనోహర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గురుప్రసాద్



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 2: బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పట్టణానికి చెందిన కె.గురుప్రసాద్‌ను నియమించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, ప్రొద్దుటూరు కోకన్వీనర్ గౌరీశంకర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపిశ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైలవరం ఎంఈవోగా రమణారెడ్డి

మైలవరం, ఏప్రిల్ 2: మైలవరం విద్యాశాఖాధికారి-1గా పి.వి.రమణా రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న జి.జే క్రిష్టఫర్ మార్చి 31వ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జమ్మలమడుగు పతంగి రామయ్య బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డిని మైలవరం ఎంఈఓగా ఉన్నతాధికారులు నియమించారు. ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డిని ఎంఈఓ-2 చిట్టిబాబు పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు.

ఆశా కార్యకర్తలకు రికార్డులను అందజేయాలి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 2: ఆశా కార్యకర్తలకు వెంటనే రికార్డులను అందజేయాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కారించాలని గత ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వంతో తమ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకత్వం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే అన్నారు. ఆ మేరకు ఆశాల రికార్డులను ఏప్రిల్ మాసం నుంచి ప్రభుత్వమే సరఫరా చేయాల న్నారు. అలాగే ఆశాల రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతున్నట్లుగా హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అమలుచేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి రికార్డులను వెంటనే అందించాలని కోరారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి
- కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు

కడప (క్రైం), ఏప్రిల్ 2:రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కడప నగరంలోని వన్‌టౌన్ పరిధిలో పలు ప్రాం తాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేర కు కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పూసల వీధి తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు ప్రజలకు భరోసా కల్పించేందుకు గాను ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా శాంతిభద్రతలను కాపాడుకోవడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్ ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

దువ్వూరు (మైదుకూరు), ఏప్రిల్ 2 : దువ్వూరు మండలంలోని బయనపల్లెకు చెందిన వైసీపీ నాయకులు కల్లు నారాయణ, శివయ్య, లక్ష్మీనారాయణ, రాజష్, నరేష్, నాగరాజు, బాలయ్య, నరసింహా, దాదాపు 60 కుటుంబాల వారు మంగళవారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రెడ్డి వెంకట రమణారెడ్డి, నాయకులు సీతారామయ్య, చంద్ర, ముద్దు రమణ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రితీష్‌రెడ్డి సమక్షంలో బేతాయపల్లె పంచాయతీ పీపీ కుంటకు చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి, కొండయ్య, వెంగళరెడ్డి ఉన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలం క్రాస్‌రోడ్డులోని చెండువాయి, మద్దూరు, వరికుంట కాలనీలకు చెందిన వైసీపీకి చెందిన 200 కుటుంబాలు మండల టీడీపీ అధ్యక్షులు పి.మల్లికార్జునరెడ్డి, మండల ఎంపీపీ రమాదేవి, మండల ఇన్‌ఛార్జ్ రెడ్డయ్య, సొద్దల పెంచలయ్య, పి.నరసింహులు, వరికుంట్ల సర్పంచ్ రమణ, సుబ్బరామిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరసింహులు, జయక్రిష్టారెడ్డి, నరసింహారెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రిషికేశవ ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీలో చేరారు. చేరిన వారిలో వంశీరాజా, శ్రీను, హటయ్య, బాలయ్య, రాజగోపాల్, వెంకటసుబ్బన్న, శివ తదితరులు ఉన్నారు.



దువ్వూరు, బద్వేలు, అట్లూరులో టీడీపీలో చేరుతున్న నాయకులు